సాక్షి
వికారాబాద్

బుధవారం । 31 । జనవరి । 2024



శిలాఫలకానికే పరిమితం

యాలాల మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ భవన నిర్మాణ పనులపై నీలినీడలు అలుముకున్నాయి.

8లో ▸



పార్టీలకు అతీతంగా..

తాండూరు అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పనిచేస్తామని మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

8లో ▸



చట్టం దృష్టిలో అందరూ..

రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని తహసీల్దార్ ప్రభు అన్నారు.

9లో ▸

న్యూస్‌రీల్

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్, వంట సలహాదారు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాండూరు మండలంలోని మహిళలకు మాత్రమే ఈ అవకాశం ఉందని తెలిపారు. నైట్ వాచ్‌మెన్ పోస్టుకు పదో తరగతి, వంట సలహాదారు పోస్టుకు ఏడో తరగతి చదివిన వారు అర్హులని తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీలోపు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి రండి

స్పీకర్‌ను కోరిన ఆర్యవైశ్య కమిటీ సభ్యులు

కొడంగల్: పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ఫిబ్రవరి 4న నిర్వహించే జిల్లా ఆర్య వైశ్య సంఘం మహాసభ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ఆ సంఘం సభ్యులు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని వేర్వేరుగా కలసి కోరారు. మంగళవారం ఈ మేరకు వారిని కలసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం మహాసభ నూతన అధ్యక్షుడు కటుకం శివకుమార్ గుప్తా మాట్లాడుతూ.. 4వ తేదీ ఉదయం 11గంటలకు సభ్యుల ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మీనారాయణ గుప్తా, మాలే లక్ష్మణ్ గుప్తా, ఆకారాపు రాజు, కటుకం వీరేందర్, ఏ ప్రవీణ్, కే చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ మన బాధ్యత

జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్



జంతు సంరక్షణపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

పరిగి: జంతువులను ప్రేమగా చూసుకోవడంతోపాటు వాటి సంరక్షణ మన బాధ్యత అని జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్ అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జంతు సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎక్కడైనా వన్యప్రాణులు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో తిరిగి పెంపుడు జంతువులపై కరుణతో ఉంటూ వాటికి ఆహారం అందిస్తూ సంరక్షించుకోవాలన్నారు. పెంపుడు జంతువులతో వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా జంతు సంరక్షణ బోర్డు నుంచి రిజిస్ట్రేషన్ పొందాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకముందు జంతు సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అంకం రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

కందులకు రికార్డు స్థాయి ధర



కందులకు బీట్లు నిర్వహిస్తున్న ఏజెంట్లు

మర్పల్లి: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం కమీషన్ ఏజెంట్లు నిర్వహించిన ధాన్యం బీట్లలో కందులకు రికార్డు స్థాయి ధర క్వింటాలు రూ. 10,590 పలికింది. గత వారం క్వింటాలు కందులకు రూ. 9,500 ధర పలుకగా మంగళవారం నిర్వహించిన బీట్లలో మొదటి రకం కందులు క్వింటాలుకు రూ. 10,590 పలికాయి. రెండో రకానికి రూ. 10,300 పలికాయి. వామ క్వింటాలు మొదటి రకం రూ. 15వేలు పలుకగా, రెండో రకానికి రూ. 13వేలు పలికినట్లు కమీషన్ ఏజెంట్లు తెలిపారు.



పూజలందుకున్న ఊరడమ్మ

వైభవంగా.. ఊరడమ్మ జాతర

తాండూరు మండలం ఉద్దండాపూర్‌లో మంగళవారం గ్రామ దేవత ఊరడమ్మ జాతర వైభవంగా సాగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య బోనాల ఊరేగింపు నేత్ర పర్వంగా సాగింది. మహిళలు ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామ దేవతను వేడుకున్నారు.

– తాండూరు రూరల్



జాతరకు భారీగా తరలివచ్చిన భక్తజనం

‘ప్రత్యేక’ కసరత్తు



రేపటితో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం

- 2నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు
- జిల్లాలో 566 జీపీలు
- 22 కేటగిరీల నుంచి ఉద్యోగుల ఎంపిక
- సరిపడా లేని గెజిటెడ్ అధికారులు

వికారాబాద్: గ్రామాల్లో ప్రత్యేక పాలనకు రంగం సిద్ధమవుతోంది. ఫిబ్రవరి ఒకటో తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కసరత్తు, షెడ్యూల్ విడుదల కాలేదు. ఇప్పటికిప్పుడు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. దీంతో జీపీలకు ప్రత్యేక అధికారులను నియమించడం అనివార్యం అవుతోంది. జనవరి ఒకటో తేదీతో ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం ముగియనుండటంతో 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించేందుకు కలెక్టర్, డీపీఓ పర్యవేక్షణలో పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

కసరత్తు ప్రారంభం

గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు అధికారులు కసరత్తును ముమ్మరం చేశారు. జిల్లాలోని పంచాయతీలకు ఎంతమంది అధికారులు అవసరం, ఏయే శాఖల నుంచి సర్దుబాటు చేయాలి అనేదానిపై కసరత్తు చేస్తున్నారు. హెల్త్, ఆర్టీఏ, పోలీస్ లాంటి అత్యవసర విధులు నిర్వహించే శాఖలను మినహాయించి మిగిలిన అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులను ప్రత్యేకాధికారులుగా నియమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల జాబితాను సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపినట్లు తెలుస్తోంది. అయితే ఎంఈఓలు, హెచ్‌ఎంలను ప్రత్యేకాధికారులుగా నియమించాలనే ఆలోచనను విరమించుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. త్వరలో 10వ తరగతి పరీక్షలు ఉన్న నేపథ్యంలో వారిని ఈ విధులకు దూరంగా ఉంచాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించరాదనే విద్యాహక్కు చట్టం నిబంధన ఉన్నప్పటికి ఇలా వారిని ప్రత్యేకాధికారులుగా నియమించాలని చూడటం ఏమిటని పలు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా పదో తరగతి ఫలితాల్లో అట్టడుగు స్థానంలో ఉండగా ఇలాంటి చర్యలు మరింత ప్రభావం చూపుతాయనే వాదన వినిపిస్తోంది.

సరిపడా లేని గెజిటెడ్ అధికారులు

గతంలో సర్పంచులు లేని గ్రామాలకు గెజిటెడ్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. అయితే జిల్లాలో 566 జీపీలకు సరిపడా గెజిటెడ్ అధికారులు లేకపోవడంతో ముందుగా జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ వరకు ఉన్న ఆయా శాఖల ఉద్యోగులకు బాధ్యతలు ఇవ్వాలని అధికారులు భావించారు. పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ కూడా జూనియర్ అసిస్టెంట్ క్యాడరే కావటంతో సమాన స్థాయి ఉన్న ఉద్యోగులకు ప్రత్యేకాధికారులుగా నియమించడం సరైంది కాదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ క్యాడర్ మొదలుకొని గెజిటెడ్ మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రత్యేకాధికారులుగా నియమించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 22 క్యాటగిరీలకు చెందిన ఉద్యోగులను ఎంపిక చేసినట్లు తెలిసింది. మేజర్ గ్రామ పంచాయతీలకు, మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీలకు ఆయా శాఖల హెచ్‌ఓడీలుగా వ్యవహరిస్తున్న జిల్లా అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఫిబ్రవరి ఒకటో తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్నందున జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే ఆయా శాఖల అధికారులు, ఉద్యోగుల జాబితా సిద్ధం చేశారు. 2వ తేదీ లోగా ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

– తరుణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి



హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

5న సీఎం రేవంత్‌రెడ్డి రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసే అవకాశం
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- హెలిప్యాడ్‌కు స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి కొడంగల్ నియోజకవర్గానికి వస్తున్నారు. ఫిబ్రవరి 5న సీఎం పర్యటన ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి, నారాయణపేట జిల్లా ఉన్నతాధికారులు కొడంగల్, కోస్గి ప్రాంతాల్లో పర్యటించారు. కోస్గిలో హెలికాప్టర్ దిగడానికి అనుకూలంగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. సీఎం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. పెద్ద ఎత్తున పనులు ప్రారంభం కానున్నాయని అధికారులు చెబుతున్నారు.

పనులపై సమీక్ష

నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై వికారాబాద్, నారాయణపేట జిల్లాల అధికారులు మంగళవారం సమీక్ష నిర్వహించారు. కొడంగల్‌లోని కడా కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రెండు జిల్లాల అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, మయాంక్ మిట్టల్‌తో చర్చించారు. కొడంగల్‌లో చేపట్టబోయే పనుల గురించి చర్చించారు. బందోబస్తుతో పాటు శంకుస్థాపనల ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు అధికారులు పట్టణంలోని పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం హెలిప్యాడ్, పార్కింగ్, రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, డీఆర్‌డీఓ పీడీ కృష్ణన్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ రాములు, ఎస్‌ఐ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కదులుతున్న రైలు ఎక్కబోయి..

- ప్లాట్‌ఫాం మధ్య ఇరుక్కున్న ప్రయాణికుడు
- రెండు గంటలపాటు నరకయాతన
- శ్రమించి బయటకు తీసిన సిబ్బంది

అనంతగిరి: కదులుతున్న రైలును ఎక్కే ప్రయత్నంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు – ప్లాట్ ఫాం మధ్య పడిపోయాడు. ఈ ఘటన వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బీదర్ – యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 8గంటల సమయంలో వికారాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. రైలు బయలుదేరుతున్న క్రమంలో ఓ ప్రయాణికుడు దాన్ని ఎక్కే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలు– ప్లాట్‌ఫాం మధ్యలో పడి ఇరుక్కుపోయాడు. ప్రయాణికులు, సిబ్బంది గమనించి రైలును ఆపారు. అక్కడే ఉన్న ఆర్‌పీఎఫ్ పోలీసులు ప్లాట్‌ఫాంను పగులగొట్టి ప్రయాణికుడిని బయటకు తీశారు. దాదాపు రెండు గంటల పాటు బాధితుడు నరకయాతన అనుభవించాడు. ఈ సమయంలో ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ సదరు వ్యక్తితో ముచ్చటిస్తూ ధైర్యం నింపారు. క్షతగాత్రుడిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి రాయచూర్‌కు చెందిన సతీష్‌కుమార్‌గా గుర్తించారు.



ప్రమాదానికి గురైన వ్యక్తిని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది



చికిత్స పొందుతున్న సతీష్‌కుమార్

పదో తరగతి అత్యంత కీలకం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: విద్యార్థి దశలో పదో తరగతి అత్యంత కీలకమైనదని, ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధ్యమని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో రాకంచర్ల సర్పంచ్ పెంటయ్య ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో మేము సైతం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు మార్గంలో వెళ్లరాదని సూచించారు. సెల్‌ఫోన్ మోజులో పడి చదువు పాడు చేసుకోరాదన్నారు. కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. దీర్ఘకాల ప్రయోజనాలు కలిగే ఆలోచనలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ హబీబ్ అహ్మద్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు, పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ ఆనందం, నాయకులు మొగులయ్య, చంద్రయ్య, సోమలింగం, వెంకటేష్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పరిగి: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రుకుంపల్లి, జాఫర్‌పల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే నియోజకవర్గం ప్రగతి బాటలో నడుస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్ రావు, జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీడీఓ శేషగిరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి పరీక్షలు
- 48 కేంద్రాల ఏర్పాటు
- హాజరు కానున్న 4,177మంది జనరల్, 2,711 మంది ఒకేషనల్ విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లా ఇంటర్మీడియెట్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ తప్పనిసరి. థీరితో పాటు ప్రాక్టికల్స్‌లో వచ్చే మార్కుల ఆధారంగా ఫలితాలు వెలువడుతాయి. ఇంటర్ స్థాయిలో సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ తప్పనిసరి. బైపీసీ విద్యార్థులకు బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, బొమ్మలు గీయడం తోపాటు రికార్డులు రాయిస్తారు. ఇందుకోసం క్షేత్ర పర్యటన, బొటానికల్ టూర్స్ వంటివి నిర్వహిస్తారు. మ్యాథ్స్ విద్యార్థులకు కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే చాలా కళాశాల్లో ప్రాక్టికల్స్ నిర్వహించక పోవడంతో విద్యార్థులు నష్ట పోతున్నారనే ప్రచారం ఉంది.

జిల్లాలో 48 సెంటర్ల ఏర్పాటు

జిల్లాలో 35 జనరల్ ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలు, 13 ఒకేషనల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జనరల్ ద్వితీయ సంవత్సరంలో 4,177 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్నారు. వీరితో పాటు ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం చదివే 1,352 మంది, ద్వితీయ సంవత్సరం చదివే 1,359 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.


ప్రైవేటులో నామమాత్రంగా..

జిల్లాలో 27 ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో కూడా ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే సరైన ల్యాబ్‌లు, ప్రాక్టికల్స్‌కు అవసరమైన రసాయనాలు లేక పోవడంతో నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. వీటి యాజమాన్యాలు అక్రమ మార్గంలో విద్యార్థులను పాస్ చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాక్టికల్స్ ల్యాబ్

ఏర్పాట్లు పూర్తి



ప్రభుత్వ కళాశాలల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తాం. అవకాశం ఉన్నంత మేర విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించాం. ప్రైవేటు కళాశాలల తీరుపై ఈ సారి గట్టి నిఘా పెడతాం. పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శంకర్ నాయక్, డీఐఈఓ

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

అడిషనల్ పీడీ స్టీవెన్ నీల్

యాలాల: ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అడిషనల్ పీడీ స్టీవెన్ నీల్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏప్రిల్ 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీకి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన పనులపై సిబ్బంది లోటు పాట్లను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం స్టీవెన్ నీల్ మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీ 7 రిజిస్టర్లను అప్‌గ్రేడేషన్ చేసుకోవాలన్నారు. నర్సరీకి సంబంధించిన 4 రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడేషన్ చేయాలని ఆదేశించారు. చాలా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో మస్టర్లలో కొట్టివేతలు, పనులకు సంబంధించిన మెటీరియల్ చెల్లింపులు, క్రీడా ప్రాంగణాల నిర్మాణాల్లో జరిగిన విషయాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో 13 పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తి కాగా, వాటి చెల్లింపులు, ఎంబీల వివరాలను సిబ్బంది అధికారులకు వివరించారు. కార్యక్రమంలో స్టేట్ టీం మానిటరింగ్ అంజద్ అలీ, ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య, డీపీఓ భార్గవి, అంబుడ్స్‌మెన్ రాములు, ఎస్‌ఆర్‌పీ చెన్నకేశవులు, ఏపీఓ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో కలెక్టర్



శ్రీవారిని దర్శించుకుంటున్న అధికారులు

కొడంగల్ : పట్టణంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన స్థానిక పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారిని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిలు మంగళవారం దర్శనం చేసుకున్నారు. ఆలయ పూజారులు వారికి స్వాగతం పలికి పూజలు చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊరడమ్మ జాతర



బెన్నూరులో బోనాలతో వస్తున్న మహిళలు

యాలాల: మండల పరిధిలోని బెన్నూరులో మంగళవారం ఊరడమ్మ(గ్రామ దేవత) జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో తరలివచ్చి, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో జాతర సందర్భంగా భక్తులు, బంధువులు గ్రామానికి తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

విరగబూసిన మామిడి పూత



ఓ చెట్టుకు నిండుగా పూసిన మామిడి పూత

వికారాబాద్ అర్బన్: ఈ ఏడాది మామిడి పూత విరగబూసింది. ఎక్కడ చూసినా మామిడి చెట్లు నిండు పూతతో కనువిందు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పూత చివరి దశ వరకు ఉంటే రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని అంటున్నారు. మామిడి పూతను ఎలా రక్షించుకోవాలనే దానిపై ఆర్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించడంతో పాటు, సలహాలు, సూచనలు ఇస్తే మరింత మేలు జరిగే అవకాశం ఉంటుంది.

అభివృద్ధిలో గౌతపూర్ ఆదర్శం

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న అధికారులు

తాండూరు రూరల్: జిల్లాలోనే గౌతపూర్ గ్రామ పంచాయతీ అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిచిందని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం తాండూరు మండలం గౌతపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచు రాజప్పగౌడ్ అధ్యక్షతన పాలకవర్గానికి పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సర్పంచు పదవి కత్తిమీద సాములాంటిదన్నారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచు కీలక పాత్ర కీలమన్నారు. గౌతపూర్ గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందినట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ రాజప్పగౌడ్ మాట్లాడుతూ.. నున్న గెలిపించిన గ్రామస్తులకు రుణపడి ఉంటానని అన్నారు. గతంలో రెండుసార్లు వైస్ ఎంపీపీగా మరోసారి సర్పంచ్‌గా ఆదరించిన గ్రామ ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. అనంతరం ఐదు సంవత్సరాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పటేల్ నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచు తహేరా బేగం, వార్డు సభ్యులు సుజాత ,మాధవి, శ్రీకాంత్ ,ప్రవీణ్ ,శ్రీకాంత్, మహేష్‌గౌడ్, మంజుల, లక్ష్మమ్మ, శివరాజ్, పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

శిలాఫలకానికే పరిమితం

- ప్రారంభం కాని అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు
- నిధులున్నా ముందుకు సాగని వైనం
- భవన నిర్మాణంపై నీలినీడలు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈశ్వర్, తదితరులు (ఫైల్)

యాలాల: మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ భవన నిర్మాణ పనులపై నీలినీడలు అలుముకున్నాయి. అట్టహాసంగా మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన పనులు చేపట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ తరువాత ఈ విషయాన్ని మరిచిపోయారు. దీంతో భవన నిర్మాణ పనుల విషయంలో దళిత సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.50లక్షలు మంజూరు

యాలాల మండల కేంద్రంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.50 లక్షల నిధులను మంజూరు చేసింది. 2022 జూన్‌లో అప్పటి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కాగా, భవన నిర్మాణానికి టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పనులను మాత్రం ప్రారంభించలేదు. భవన నిర్మాణ వ్యయం, అంచనా వ్యయం కంటే ఎక్కువగా ఉన్నందున్న పనులను కాంట్రాక్టరు ప్రారంభించలేదని సమాచారం. అయితే, ఈ విషయంలో అటు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. తాండూరు పట్టణంలో రూ.కోటి నిధులతో భవన నిర్మాణ పనులను దాదాపు 60శాతం పూర్తయ్యాయి. అయితే, యాలాల మండల కేంద్రంలో మాత్రం పునాదులు సైతం తీయలేదని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టి సారించాలి



అంబేడ్కర్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఏడాదిన్నర దాటిన పనుల్లో పురోగతి లేదు. ఈ విషయంలో సదరు కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టడం లేదా మరోకరికి పనులను అప్పగించాలి. అంబేడ్కర్ భవన పనులు కనీసం ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఈ విషయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– బుగ్గప్ప, దళిత సంఘ నాయకుడు

కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు



భవన నిర్మాణానికి నిధులు తక్కువగా ఉన్నాయనే కారణంతో యాలాలలో భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఈ విషయమై కాంట్రాక్టరు గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే ముందుగా తాండూరు పట్టణంలో మాత్రం అంబేడ్కర్ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. యాలాల విషయంలో ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా.

– వీరానందం, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్

ట్రెయినీ అదనపు కలెక్టర్‌కు వీడ్కోలు



అమిత్ మలెంపాటిని సన్మానించిన అధికారులు

ధారూరు: ఇన్‌చార్జి ఎంపీడీఓగా కొనసాగిన ట్రెయినీ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ మలెంపాటిని మంగళవారం మండల రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి శాలువాలు, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీల్డ్‌వర్క్‌పై దృష్టి సారించి అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నా నని అన్నారు. ఉపాధిహామీ పనులపై ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో కార్యాలయాల్లో పనితీరును పరిశీలించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన చేసుకున్నా నని చెప్పారు. ధారూరు మండలం చాలా బాగుందని, కేరెల్లి గ్రామం అనంతగిరి హిల్స్‌తో శోభినిస్తుందని, కోట్‌పల్లి ప్రాజెక్టు పర్యాటకులను ఆకర్షిస్తుందని తెలిపారు. మొక్కల ప్లాంటేషన్, నర్సరీల నిర్వహణ బాగున్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీఓ షఫీఉల్లా, ఏపీఓ సురేష్, గ్రామ కార్యదర్శు లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

పరిగి: మిషన్ భగీరథ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 16న సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జాపర్‌పల్లి మిషన్‌భగీరథ నీటిశుద్ధి కేంద్రం వద్ద కార్మికులతో కలిసి సమ్మె వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కంపెనీలకు ఇచ్చే ఎస్ఎస్ఆర్ రేట్లు రూ.18వేలకు పైగా చూయిస్తూ కార్మికులకు కేవలం రూ.8500 ఇచ్చి చేతులు దులుపుకున్నారని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, 20శాతం బోనస్, రక్షణ పరికరాలు అందించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచులే కీలకం

జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్



పాలకవర్గం సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మోమిన్‌పేట: గ్రామాలాభివృద్ధికి సర్పంచులే కీలకమని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మోమిన్‌పేట గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవి విరమణ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గం తీర్మానంపై పల్లెల అభివృద్ధి ఆధార పడి ఉంటుందన్నారు. స్థానిక సంస్థలు బలంగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. అత్యున్నత పార్లమెంటు, అసెంబ్లీ, గ్రామ పంచాయతీలే అభివృద్ధికి మూలమన్నారు. ప్రస్తుత పంచాయతీ పాలనలో చిరస్థాయిగా నిలిచిపోయే అభివృద్ధి చేశారని ఆయన కొనియాడారు. ముఖ్యంగా శ్మశానవాటికల నిర్మాణం, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు వంటి అభివృద్ధి పనుల ఎన్నో చేశారని పేర్కొన్నారు. ఒకప్పుడు పల్లెలో స్వచ్ఛమైన తాగునీటికి ఇబ్బందులు పడేవారని మిషన్ భగీరథతో శాశ్వతంగా పరిష్కరించారని తెలిపారు. అంతకుముందు పాలనవర్గం సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. సర్పంచు అంగేరి శ్రీనివాస్‌రెడ్డిని ఎర్ర బంగారంతో తులాభారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మాజీ వైస్ చైర్మన్ ప్రభు. మాజీ సర్పంచు చంద్రయ్య, కార్యదర్శి నర్సింలు, ఉప సర్పంచు నరేష్, ఎస్‌టీఓ ఉమమహేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, విఠల్‌రెడ్డి, బస్వరాజ్, నారాయణరెడ్డి, రాంరెడ్డి, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పనిచేస్తా
- గతంలో మాదిరి రాజకీయ గొడవలు ఉండవు
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- ప్రజాసేవకు విరమణ ఉండొద్దు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- సర్పంచులు, ఎంపీటీసీలకు ఘనంగా సన్మానం



మహేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బషీరాబాద్: పార్టీలకు అతీతంగా తాండూరు అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పనిచేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో మాదిరి తాండూరులో ఇక రాజకీయ గొడవలు ఉండవని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం బషీరాబాద్ మండలం కొర్విచెడ్ గ్రామంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి శివాజీ మహరాజ్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. అనంతరం పదవి విరమణ చేస్తున్న సర్పంచులకు, ఎంపీటీసీలకు సన్మానం చేసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇక నుంచి రాజకీయాలు పక్కన పెట్టి తాండూరు అభివృద్ధికి ఇద్దరం కలిసి పని చేస్తామన్నారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు బషీరాబాద్‌లోని చిన్నచిన్న తండాలు, అనుబంధ గ్రామాలను పంచాయతీలుగా చేశానని, దీంతో ఎంతో మంది చదువుకున్న యువతీ, యువకులు రాజకీయాల్లోకి వచ్చి సర్పంచులుగా ఎన్నికయ్యారని అన్నారు. పదవీ విరమణ చేస్తున్న సర్పంచులకు ఇక ముందు కూడా అండగా ఉంటామన్నారు.

ప్రజాసేవకు పదవీ విరమణ ఉండదు: ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

ప్రజాసేవకు పదవీ విరమణ ఉండదని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లో అమలు చేస్తామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ మనకు పక్కనే ఉన్నందున తాండూరులోనూ భారీగా అభివృద్ధి పనులు జరుగబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో శివాజీ మహరాజ్ విగ్రహాలే ఊరూరా ఉంటాయని, ఆయన స్ఫూర్తితో యువత నడుచుకోవాలన్నారు. కొర్విచెడ్ గ్రామాభివృద్ధికి తక్షణమే రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ శోభారాణి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శాంతాబాయి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, నాయకులు రాము నాయక్, వెంకటేశ్ మహరాజ్, సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ వెంకట్‌స్వామి, ఎంపీడీఓ రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పూడూరు: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మిట్టకంకల్‌లో నూతన పంచాయతీ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కడుమూరు ఆనందం, పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, సర్పంచ్ శ్యాంకుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాలు విక్రయిస్తే చర్యలు

అనంతగిరి: పట్టణంలోని పాన్‌షాపులు, దుకాణాల్లో నిషేధిత గుట్కా, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ టౌన్ సీఐ శీను హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం వికారాబాద్‌లో సీఐ తన సిబ్బందితో కలిసి పాన్‌షాపులు, దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహబూబ్, షఫీ ఉల్లా పాన్‌షాపులలో నిషేధిత గుట్కా, ఎంసీ, ఓఆర్‌సీ పేపర్లు, నిషేధిత సిగరెట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం



గోపాల్ (ఫైల్)

మర్పల్లి: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మర్పల్లి పీఎస్ పరిధిలోని వీర్లపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా.. మండలంలోని వీర్లపల్లికి చెందిన గొండ్ల గోపాల్ (18) సోమవారం ఉదయం వికారాబాద్ కోర్టుకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. మధ్యాహ్నం మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. ఎంతకు ఇంటికి రాలేకపోవడంతో ఫోన్ చేయగా గోపాల్ ఫోన్ లిఫ్ట్ చేయలేదు. ఆ తరువాత కొంత సమయానికి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మంగళవారం గోపాల్ తండ్రి శంకరయ్యగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

డిప్యూటీ కమిషనర్ ఆఫీస్‌కు అటాచ్

అనంతగిరి: వికారాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వర్‌రావును రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేస్తూ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మండలంలోని ట్రాన్స్ విచీత రిసార్ట్‌లో కొన్ని రోజుల క్రితం ఎస్ఐ కోటేశ్వరరావు మాదకద్రవ్యాల సరఫరా జరుగుతుందంటూ తనిఖీలకు వెళ్లారు. తనిఖీల పేరుతో అక్కడ గదుల్లో ఉన్న పర్యాటకులతో దురుసుగా మాట్లాడటం జరిగిందని ఫిర్యాదు అందింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు అధికార దుర్వినియోగం, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలింది.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి



తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

పరిగి: ఉపాధ్యాయ సమస్యలపై బీజేపీ ఎల్లప్పుడు పోరాటం చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్టపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని తపస్ ప్రాంతీయ కార్యాలయంలో 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంఘాలు ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనే ప్రభుత్వాలు దిగివస్తాయన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి ఉండి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుందన్నారు. కేంద్ర విధానంతోనే విద్యావ్యవస్థ ఎంతో బలపడిందన్నారు. నేటికి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు మాత్రమే అందుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేసిందేమి లేదని విమర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలు, విద్యావ్యవస్థ అభివృద్ధికి తాను ఎల్లప్పుడు ముందుండి పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేవీరాడార్‌కు అనుమతిచ్చింది కాంగ్రెస్సే

మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: నేవీరాడార్ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్‌ను బద్నాం చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ తెచ్చిందన్నారు. 2011లో గ్రామసభ ఏర్పాటు చేసి 2014లో అనుమతులు ఇచ్చిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫైనల్ అనుమతులు ఇవ్వకుండా ప్రాజెక్టును అడ్డుకున్నారని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తిరిగి ప్రాజెక్టు పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. కావాలని బీఆర్ఎస్‌పై బురద జల్లడం మంచి కాదన్నారు. పర్యావరణాన్ని దెబ్బతీసేలా ప్రయత్నిస్తే ఊరుకునేదిలేదని పెద్ద ఎత్తున అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజారుద్దీన్, సత్యానందస్వామి, వెంకటయ్య, రామన్న, సాయన్న, రాజేందర్, జాహెద్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నష్టం వాటిల్లితే చర్యలు

ఆర్డీఓ విజయకుమారి



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పరిగి: ఫ్యాక్టరీ కాలుష్యం వల్ల పంటలకు నష్టం జరిగితే ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ విజయకుమారి అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ సమీపంలోని సుగుణ స్టీల్ ఫ్యాక్టరీ వల్ల పంటలు సక్రమంగా పండటం లేదని, పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని గ్రామానికి చెందిన రైతు అంజయ్య లోకయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీ చుట్టూ పక్కల ఉన్న పంటలను పరిశీలించారు. ఫ్యాక్టరీ నిర్వాహకులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటల దిగుబడి, ప్రజలకు ఎలాంటి రోగాలు వస్తున్నాయని పూర్తి రిపోర్టును వారం రోజుల్లో ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఫ్యాక్టరీ నిర్వాహకం వల్ల ఏమైన రైతులకు నష్టం వాటిల్లితే, మానవ మనుగడకు ఇబ్బందులు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయధికారి గోపాల్, తహసీల్దార్ ఆనంద్‌రావు, మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాండూరు టౌన్‌లో నాకాబందీ

పలు వాహనాలు సీజ్



ఆటో డ్రైవర్‌ను బ్రీత్ అనలైజింగ్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

తాండూరు టౌన్ : తాండూరు పట్టణంలో సోమవారం రాత్రి పోలీసులు నాకాబందీ నిర్వహించారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, అనుమతి పత్రాలు, బ్రీత్ అనలైజింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని, ఆటోల్లో పరిమితికి మించి ప్యాసింజర్లను తీసుకెళ్లరాదని, మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారకులు కావొద్దని సూచించారు.

పాన్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- హుక్కా సామగ్రి స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న హుక్కా సామగ్రి

తాండూరు టౌన్ : జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశానుసారం టాస్క్‌ఫోర్స్ జిల్లా ఇన్‌చార్జి ప్రశాంత్ వర్ధన్ నేతృత్వంలో మంగళవారం తాండూరు పట్టణంలోని పలు పాన్‌షాపులపై దాడులు నిర్వహించారు. స్థానిక ఇందిరాచౌక్‌లోని జీషాన్, నేచర్, భద్రేశ్వర పాన్‌షాపుల్లో తనిఖీలు చేశారు. పాన్‌షాపుల నుంచి సుమారు రూ. 50 వేల విలువ గల హుక్కా సామగ్రి, హుక్కా ఫ్లేవర్లు, నిషేధిత గంజాయి సేవించే స్ట్రీపులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మూడు పాన్‌షాపుల యజమానులను అరెస్టు చేసినట్లు ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.